క్లుప్తంగా

చెరువులో చేపలు మృతి



మోపిదేవి: మండల కేంద్రమైన మోపిదేవి పంచాయతీ పరిధిలోని బట్టువాని చెరువులో చేపలు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఈ ఘటనను పంచాయతీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. పంచాయతీకి చెందిన చెరువును మూడేళ్ల కాలపరిమితితో లీజుకు తీసుకుని చేపలు సాగు చేస్తున్నామని ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ బాధ్యుడు కొమ్ము విల్సన్ తెలిపారు. చేపలు మృతి చెందడంతో సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు చెరువును పరిశీలించారు. మృతి చెందిన చేపలను పరిశీలించి, చెరువు నీటిని పరీక్షలకు పంపించామని పంచాయతీ కార్యదర్శి త్రిపుర సుందరి తెలిపారు. పురుగు మందు కలిపినందునే చేపలు మృతి చెందినట్లు తెలియడంతో ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు కేసగాని రాంబాబు, నందిగం అభిషేకరావు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమన్నారాయణుడి అధ్యయనోత్సవాలు



కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలో వేంచేసిన గోద, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో శ్రీమన్నారాయణుడి 11 అడుగుల మూలవిరాట్ ప్రత్యేక పూజలు చేశారు. రామానుజాచార్యులు, శ్రీ చక్రం, నమ్మాళ్వార్ల విగ్రహాలకు ప్రత్యేక అలంకారాలు చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పూలమాలలతో ముస్తాబు చేశారు. కోడూరు, చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మాధికారి పంచాంగం రంగాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రీసర్వేలో చెక్ పాయింట్ల పరిశీలన



పెడన: వైఎస్సార్ భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వేకు సంబంధించి ఇప్పటికే ప్రాథమిక సర్వే పూర్తయిందని, దీనికి సంబంధించిన చెక్ పాయింట్లను పరిశీలించామని పట్టణ సర్వే అధికారి (టీపీఓ) వి.ఏసు బాబు తెలిపారు. ఆయన సోమవారం చెక్ పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఇప్పటికే డ్రోన్ కెమెరాలతో పాటు రోవర్ల ద్వారా ఇమేజీలు తీశామన్నారు. పట్టణం 12.8 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించినట్లు తేలిందని, ప్రతి కిలో మీటరుకు ఒక చెక్ పాయింట్ ఇస్తారని తెలిపారు. ఈ చెక్ పాయింట్‌లో ఆ ప్రాంతానికి చెందిన ఇమేజ్‌లు ఉంటాయన్నారు. ఆ ఇమేజ్‌లకు, క్షేత్రస్థాయిలోని స్థలానికి కొలతలు సరిగ్గా సరిపోయిందీ లేనిదీ సర్వే ద్వారా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఈ చెక్ పాయింట్‌లు ఎక్కడెక్కడ ఉన్నదనే దానిపై పరిశీలన చేసి ఒక అవగాహనకు వచ్చామన్నారు. తనతో పాటు పట్టణంలోని సర్వే కార్యదర్శులు పాల్గొన్నారని టీపీఓ ఏసుబాబు తెలిపారు.

పరస్పర కేసులు నమోదు

కోనేరుసెంటర్: ఓ మహిళ స్నానం చేస్తుండగా కొంత మంది సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాల మధ్య పరస్పర దాడులు జరిగాయి. పోలీసుల కథనం మేరకు.. బలరామునిపేటకు చెందిన మణికంఠ సమీప బంధువైన మహిళ ఈ నెల ఎనిమిదో తేదీ రాత్రి స్నానం చేస్తుండగా టెంపుల్‌కాలనీకి చెందిన గాలంకి శ్రీను, నాగరాజు మరి కొందరు సెల్‌ఫోన్‌లో వీడియో తీసేందుకు పూనుకున్నారు. దీనిని గమనించిన మణికంఠ వారితో గొడవ పడ్డాడు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. శ్రీను, నాగరాజు, వెంకటేశ్వరరావు మరి కొందరు మణికంఠతో పాటు అతని బంధువైన మహిళ, ఆమె కుమారుడిపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘర్షణలో మణికంఠ తలకు బలమైన గాయాలయ్యాయి. మహిళ కూడా గాయపడింది. ఈ ఘటనపై మణికంఠ చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మణికంఠ అతని బంధువులు తమపై అకారణంగా దాడి చేశారంటూ గాలంకి శ్రీను ఫిర్యాదు చేశాడు. ఈ పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహోజ్వలిత ఘట్టం.. ప్రజా సంకల్పయాత్ర

కేక్ కట్ చేసిన మంత్రి జోగి రమేష్

పెడన: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోజ్వలితమైన ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసి నాలుగేళ్ల గడిచాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో ఆయన సోమవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంకుటిత దీక్షతో ప్రజా సంకల్పయాత్ర చేశారని గుర్తుచేశారు. ఈ యాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తూ మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని మంత్రి కొనియాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, దళారి వ్యవస్థ లేకుండా నేరుగా అర్హుల గడప వద్దనే సంక్షేమ పథకాలు అందేలా పటిష్ట చర్యలు తీసుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, పార్టీ నాయకులు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, పేరిశెట్టి తేజోవతి, మాధవి, గొరిపర్తి రవికుమార్, తలుపుల కృష్ణ, రత్నారావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు

పెడన పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు బంటుమిల్లి రోడ్డు సెంటరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్నరాణి, కౌన్సిలర్లు పిచ్చుక సతీష్, బాబూలాల్, పార్టీ నాయకులు వన్నెంరెడ్డి మహంకాళరావు, హనీఫ్‌ఖాన్, వీణం రాము తదితరులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.



అవనిగడ్డలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, వికాస్ తదితరులు



పెడనలో మిఠాయిలు పంచుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి తదితరులు



కృత్తివెన్ను మండలం చెరుకుమిల్లిలో సంబరాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మకం

అవనిగడ్డ: తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ప్రజా సంకల్పయాత్ర నిర్వహించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక వంతెన సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే సింహాద్రి, యువనేత సింహాద్రి వికాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రజా సంకల్పయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు, ఇబ్బందులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దగ్గరగా చూడటం వల్లే అన్ని వర్గాల ప్రజలకు లబ్ధిచేకూరేలా మంచి పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో ఏ నాయకుడూ చేయని విధంగా ఆయన చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ప్రతి రాజకీయ నాయకునికి ఆదర్శమన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన స్వర్ణయుగమైతే తండ్రికి మించిన గొప్ప పాలన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డికి రోజు రోజుకూ పెరుగుతున్న ప్రజాదరణకు బెంబేలెత్తి పోతున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు ఏమి చేయాలో దిక్కు తోచక పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని సింహాద్రి రమేష్ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రంలో ఉన్న 175 స్థానాల్లో ఒంటరిగా పోటీచేసే పరిస్థితి లేదంటే జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణ ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైఎస్సార్ సీపీ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, దిడ్ల కిరణ్, షేక్ నజీర్‌బాషా, అన్నపరెడ్డి రాందాస్, ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్, తుంగల అంకాలరావు, గార్లపాటి గోపీ, అవనిగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుమిల్లిలో సంబరాలు

కృత్తివెన్ను: ప్రజల కష్టాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం సంబరాలు చేసుకున్నాయి. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి కేక్, మిఠాయిలను పంచారు. ఎంపీపీ గరుడ ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, దేవస్థానం చైర్మన్ నాగేశ్వరరావు, పి.నాని, వి.బాబూరావు, సర్పంచులు కృపావేణి, ప్రభుప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

ఎన్ఆర్ఈజీఎస్ డీఆర్పీ హరి



సభలో మాట్లాడుతున్న డీఆర్పీ హరి

మెరకనపల్లి(మోపిదేవి): ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని ఎన్ఆర్ఈజీఎస్ డీఆర్పీ కె.హరి అన్నారు. మండలంలో పలు గ్రామ సచివాలయాల వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి పనులు, పింఛన్లు, పంచాయతీ డిపార్ట్‌మెంట్ అభివృద్ధి పనులకు సంబంధించి సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. మెరకనపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో వారం రోజులుగా గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను డీఆర్పీ హరి చదివి వినిపించారు. ఒకే కాలువలో రెండు గ్రూపులో పనిచేసినట్లు, సుమారు రూ.58 వేలకు పైగా జరిగిన పనులకు ఎంబుక్ సమర్పించలేదని, మరొక ఎంబుక్‌లో పనుల వివరాలను నమోదు చేయలేదని, గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా 500 మొక్కలు నాటినట్లు నమోదు చేసినా, అక్కడ మొక్కలే లేవని, ఇతర గ్రామాల్లో ఉన్నవారి పేరున మస్టర్లు వేశారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం పది గంటలకు జరిగే ప్రజావేదికలో పూర్తివివరాలను తెలుపుతామని చెప్పారు. ఏమైనా తప్పులు చేసినట్లు రుజువైతే సంబంధిత వ్యక్తుల నుంచి నిధులు వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఎస్ఆర్పీ సీహెచ్ రాజు, ఏపీఓ ముజ్నా, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, మేట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు



కప్పలదొడ్డి గ్రామంలో వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి జోగి రమేష్



అవనిగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వికాస్

గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి జోగి రమేష్

పెడన: రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక సమస్యలను పరిష్కరించడం, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి వారికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంతకంతో కూడిన కరపత్రాలను అందజేశారు. అడగకుండానే సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనం మరిచిపోకూడదని స్పష్టం చేశారు. పెంచిన పింఛన్ అందుతోందా లేదా అని వృద్ధులను ఆరా తీశారు. ప్రతి గడపలోను ఆనందం వెల్లివిరియడంతో మరింత ఉత్సాహంగా కార్యక్రమాన్ని కొనసాగించారు. పలు చోట్ల మంత్రికి ప్రజలు హారతులు పట్టగా, మరికొందరు ఆప్యాయంగా కరచాలనం చేశారు. గ్రామస్తులు చెప్పిన సమస్యలను నమోదు చేసి, పరిష్కరించేలా కృషిచేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వలంటీర్లు తమ పరిధిలో సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎవరికైనా సంక్షేమ ఫలాలు అందకపోతే, వారికి న్యాయం చేసేందుకే గడప గడపకు మన ప్రభుత్వం చేపట్టామని మంత్రి జోగి రమేష్ తెలిపారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, సర్పంచ్ మాధవి, తహసీల్దారు విజయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారావు, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవి కుమార్, తలుపుల కృష్ణ, కారుమంచి కామేశ్వరరావు, రత్నరావు, తేజోవతి, నాగరాజు, పిచ్చుక గంగాధరరావు, నేతల కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే ముఖ్యమంత్రికే పట్టం కట్టండి

–ఎమ్మెల్యే సింహాద్రి రమేష్

అవనిగడ్డ: చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తో పాటు ఎన్ని పార్టీలు కలసి పోటీ చేసినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరని, పని చేసే ముఖ్యమంత్రికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. అవనిగడ్డ ఐదో సచివాలయం పరిధిలోని మండలిపురం, సింహాద్రి కాలనీ, వైశ్య కాలనీ, మండలినగర్‌లో సోమవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, యువనేత సింహాద్రి వికాస్ గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి, వికాస్ ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ మాట్లాడుతూ.. సీఎం జగన్ చేపట్టిన నాడు – నేడు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ, ఆరోగ్య శ్రీ, జగనన్న కాలనీ వంటి కార్యక్రమాలు దేశానికే ఆదర్శనీయంగా నిలిచాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి భారతదేశ చరిత్రలో ఎవరూ లేరని, సంక్షేమ పథకాల్లో ఒక్క రూపాయి అవినీతికి తావులేకుండా ప్రతిగడపకు చేరుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఒక్క సంక్షేమ కార్యక్రమం ఆగకుండా జనరంజక పాలన అందిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా కొంతమంది మహిళలు ఎమ్మెల్యే సింహాద్రికి హారతులు పట్టి స్వాగతం పలికారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైఎస్సార్ సీపీ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, అన్నపరెడ్డి రాందాస్, షేక్ నజీర్‌బాషా, గాజుల జయగోపాల్, తుంగల అంకాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ

మోపిదేవి: మండలంలోని పెదకళ్లేపల్లిలో ఇటీవల గ్యాస్ పొయ్యి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వంట మేస్త్రులు పేరం పోతురాజు, పేరం వెంకటేశ్వరావును అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సోమవారం సాయంత్రం పరామర్శించారు. రెండు వారాల క్రితం వంట చేస్తుండగా గ్యాస్‌బండ్ లీకై పోతురాజు కాలుకు మంటలు అంటుకున్నాయి. అన్న ప్రమాదంలో ఉన్నాడని తమ్ముడు వెంకటేశ్వరావు పరుగున వస్తుండగా జారి పక్కనే ఉన్న నూనె కళాయిలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరూ రెండు వారాలుగా మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొంది, ఇంటికి రావడంతో ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో రూ.25 వేలను బాధితులకు అందజేశారు. గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు, మాజీ సర్పంచ్ అరజా వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట కృష్ణాంజనేయులు పాల్గొన్నారు.


కలెక్టర్, ఎస్పీని కలిసిన శాప్ చైర్మన్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ పి.జాషువాను కలెక్టర్ బంగ్లాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. మచిలీపట్నంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన తొలుత కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్, ఎస్పీలను కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులతో ఉద్యోగ అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న వాణిజ్య పన్నుల సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు

మచిలీపట్నంటౌన్: ఇంటర్మీడియెట్‌లో వృత్తివిద్యా కోర్సులు చదివే విద్యార్థినిలకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మచిలీపట్నం వాణిజ్య పన్నులశాఖ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. లేడీ యాంప్తిల్ కళాశాలలో వృత్తివిద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థినులకు నెలరోజులుగా వాణిజ్య పన్నుల కార్యాలయంలో ఇస్తున్న ఉపాధి శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థినులకు వెంకటేశ్వరరావు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వాణిజ్య పన్నులశాఖ అధికారులు సాంబశివరావు, భార్గవి, కళాశాల అధ్యాపకులు హరనాథ్ బాబు, మున్వర్ పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

బంటుమిల్లి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ జె.స్వర్ణభారతి సోమవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం పది గంటలకు ఎంపీపీ వి.తారశశిజ్యోత్స్నకృష్ణ (చినబాబు) అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. అధికారులు శాఖా నివేదికలతో సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పాటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతలుగా పద్మజ, శివపార్వతి, వేణి వ్యవహరించారు. చేతిరాత పత్రిక నిర్వహిస్తున్న విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం అర్థశాస్త్ర సదస్సు నిర్వహించారు. అర్థశాస్త్ర హెచ్‌ఓడీ వీరకుమారి, విశ్రాంత లెక్చరర్ సి.శ్రీనివాసరావు కీన్స్ వడ్డీ సిద్ధాంతాన్ని వివరించారు.

కళాంజలిలో..

పెడన: పట్టణంలోని కళాంజలి హైస్కూలులో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు భోగిపండ్లు పోశారు. బాలికలు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. పలువురు చిన్నారులు విచిత్రవేషధారణతో హాజరయ్యారు. ప్రిన్సిపాల్ దిలిప్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాల ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను ఉత్సాహం నిర్వహించారు. కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథిగా సర్పంచ్ గొరుముచ్చు ఉమా విచ్చేసి బహుమతులు అందజేశారు.



ముగ్గులు పరిశీలిస్తున్న సర్పంచ్ ఉమా



వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి

ముగిసిన సంక్రాంతి సంబరాలు

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మూడు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సంబరాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరయ్యారు. భోగి మంటలువేసి, కోలాట నృత్యాలతో సందడి చేశారు. అనంతరం విజేతలకు ప్రిన్స్‌పాల్ డాక్టరు ఎస్.జగన్‌మోహన్ రావు బహుమతులు అందజేశారు.

రేపు త్యాగరాజ స్వామి ఆరాధనా మహోత్సవాలు

గుడివాడటౌన్: త్యాగబ్రహ్మ వైభవ ప్రకాశ సభ, ఉపద్రష్ట ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఏడు గంటలకు త్యాగరాజస్వామి 176వ ఆరాధనా మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట సత్రంలో జరిగే కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరీదేవి దేవస్థానం నుంచి ఉంఛవృతి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు, ములకట్ల బ్రహ్మనందశాస్త్రి త్యాగరాజ కీర్తన వైభవం, ప్రసంగాలు, బృందగానాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ఆటల పోటీల్లో వాసవి పాలిటెక్నిక్ విద్యార్థులకు పతకాలు



పెడన: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగిన ఐపీఎస్ జీఎం–2023 రీజియన్ మీట్‌లో పెడన మండలం నందమూరు శ్రీవాసవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ విద్యార్థులు పలు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎన్.వి.కె.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగం డిస్కస్ త్రోలో వై.బోనిక స్వర్ణం, షార్ట్‌పుట్‌లో ఎస్.రేణునాగభవాని రజతం, 400 మీటర్లు రిలే పరుగులో ఆర్.రేఖ, వై.బోనిక, జి.దుర్గ, ఎం.దివ్యధాత్రి కాంస్యం సాధించారు. ఖోఖోలో లక్ష్మీ ప్రసన్న, రేఖ, బోనిక, కృష్ణవేణి, శివలీలాశ్రీ, దుర్గ, గీతాంజలి, దివ్యధాత్రి, దివ్య, శ్రీలక్ష్మి, వాసవి, ధనలక్ష్మిలు రజత పతకం గెలుచుకున్నారు. బాలుర విభాగం డిస్కస్ త్రోలో ఎం.నాగశివరాజీవ్ రజతం, వై.తరుణ్ కాంస్యం సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్ రమేష్‌ను కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కుమార్‌బాబు, డైరెక్టర్లు సాయి, బాబు తదితరులు అభినందించారు.